గ్రూప్ 3 పరీక్షా కేంద్రాల వద్ద ఆంక్షలు

● సీపీ అవినాష్ మహంతి ఆదేశాలు

హైదరాబాద్ సిటీ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో గ్రూప్ 3 పరీక్షా కేంద్రాల వద్ద ఆంక్షలను విధిస్తూ సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి ఆదేశాలు జారీ చేశారు. ఈనెల 17, 18 తేదీల్లో నగరంలో పలు పరీక్ష కేంద్రాల్లో గ్రూప్ 3 పరీక్షలు జరగనున్నాయి. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు గాను ఆయా పరీక్షా కేంద్రాల వద్ద 200 మీటర్ల పరిధిలో ఐదుగురి కంటే ఎక్కువమంది గుమిగూడి ఉండటంపై నిషేధం విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు.


ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న జడ్సీ అపూర్వ్ చౌహాన్

ప్రజావాణికి 40 ఫిర్యాదులు

కేపీహెచ్‌బీకాలనీ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంతో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 40 ఫిర్యాదులు వచ్చాయి. జడ్సీ అపూర్వ్ చౌహాన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కూకట్‌పల్లి, మూసాపేట్, కుత్బుల్లాపూర్, గాజులరామారం, అల్వాల్ సర్కిళ్ల పరిధిలో వచ్చిన ఫిర్యాదులను జోనల్ అధికారులు ఆయా సర్కిల్ అధికారులకు ఫార్వార్డ్ చేశారు. 25 టౌన్‌ప్లానింగ్, 15 ఇంజనీరింగ్‌కు సంబంధించి ఫిర్యాదులు అందాయి. ఆయా సర్కిల్ డీసీల పర్యవేక్షణలో అధికారులు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జడ్సీ ఆదేశాలు జారీ చేశారు.

సర్వీస్‌రోడ్డు వేయాలని జడ్సీకి వినతి

హైదర్‌నగర్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ నుంచి కూకట్‌పల్లి వరకు సర్వీస్ రోడ్డు వేయాలని జోనల్ కమిషనర్ అపూర్వచావ్‌హన్‌కు సోమవారం కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఏకాంత్‌గౌడ్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏకాంత్‌గౌడ్ మాట్లాడుతూ జేఎన్‌టీయూ నుంచి కూకట్‌పల్లి వరకు ముంబై హైవే రోడ్డును అనుకొని ఉన్న సర్వీస్‌రోడ్డులో విద్యుత్ స్తంభాలు, షాపింగ్‌మాల్స్ వారు ఏర్పాటు చేసుకున్న అక్రమ పార్కింగ్‌లను తొలగించాలని కోరారు. దీంతో ప్రజలకు ట్రాఫిక్ సమస్య నుంచి విముక్తి కలుగుతుందని వినతిపత్రంలో వారు వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జితేందర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పాపిరెడ్డినగర్ కాలనీ అభివృద్ధికి కృషి


రోడ్డుపనులు పరిశీలిస్తున్న శ్రీధర్‌రెడ్డి

హైదర్‌నగర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పాపిరెడ్డినగర్ కాలనీని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు ఎమ్మెల్యే గాంధీ సహకారంతో అహర్నిశలు కృషిచేస్తున్నానని పార్టీ సీనియర్ నాయకుడు చిట్టిరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన ఎమ్మెల్యే గాంధీ ఆదేశాల మేరకు అధికారులతో కలిసి పాపిరెడ్డినగర్ 13బ్లాక్, 15సిబ్లాక్, 21బీ బ్లాక్‌లలో సీసీరోడ్డు పనులను పరిశీలించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారుడు

అందె నరసింహ మృతి


అందె నరసింహ(ఫైల్)

హైదర్‌నగర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): తొలి, మలిదశ తెలంగాణ ఉద్యమకారుడు అందె నరసింహ సోమవారం తెల్లవారుజామున అనారోగ్యంతో మృతిచెందారు. 1969తొలి తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నారు. అనంతరం ముంబైలో ఉద్యోగం కోసం వెళ్లి నగరానికి తిరిగి వచ్చి హెచ్‌ఎంటీ కంపెనీలో ఉద్యోగంలో చేరారు. 2001లో హెచ్‌ఎంటీ కంపెనీ జేఏసీలో చురుకుగా పాల్గొని ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత వాలంటరీ రిటైర్డ్‌మెంట్ తీసుకుని హెచ్‌ఎంటీ శాతవాహన కాలనీలో స్థిరపడ్డారు. రెండు రోజుల క్రితం జ్వరం రావడంతో ఆస్పత్రిలో చేరారు. శ్వాస ఆడటంలో ఇబ్బంది రావడంతో వైద్యులు వెంటిలేటర్‌పై వైద్యం అందించారు. చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. ఆయన మృతిపట్ల కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్, పలువురు తెలంగాణ ఉద్యమకారులు, కాలనీ వాసులు సంతాపం తెలిపారు.

● డీసీ వంశీకృష్ణకు అభినందనలు


మూసాపేట్ సర్కిల్ నూతన డీసీగా నియమితులైన వంశీకృష్ణను సోమవారం ఆయన కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలుపుతున్న కేపీహెచ్‌బీకి చెందిన టీడీపీ రాష్ట్ర నాయకులు వేజెండ్ల కిషోర్ బాబు

- కేపీహెచ్‌బీకాలనీ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి)

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అల్లాపూర్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): విద్యుత్ నిర్వహణా పనుల కారణంగా అల్లాపూర్ డివిజన్‌లోని పలు కాలనీలలో నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రాకేష్‌గౌడ్ ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ పర్వత్ నగర్ ఫీడర్ పరిధిలోని శ్రీవివేకానందనగర్, పర్వతనగర్, పట్టణ ఆరోగ్య కేంద్రం పరిసరాలలో ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు, 11కేవీ అల్లాపూర్ ఫీడర్ పరిధిలోని గాయత్రినగర్, జ్యోతినగర్, చంద్రాగార్డెన్ ఏరియాలలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ రాకేష్‌గౌడ్ తెలిపారు.

కూకట్‌పల్లి రైతుబజార్‌లో ధరలు

కేపీహెచ్‌బీకాలనీ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి రైతుబజార్‌లో ధరలు ఇలా ఉన్నాయి. టమోట రూ.23, వంకాయ రూ.55, బెండకాయ రూ.55, పచ్చిమిర్చి రూ.30, బజ్జిమిర్చి రూ.60, కాకరకాయ రూ.32, బీరకాయ రూ.42, క్యాబేజీ రూ.35, బీన్స్ రూ.55, క్యారెట్ రూ.70, గోబి పువ్వు రూ.23, దొండకాయ రూ.35, చిక్కుడుకాయ రూ.70, గోరు చిక్కుడు రూ.40, బీట్‌రూట్ రూ.55, క్యాప్సికం రూ.75, ఆలుగడ్డ రూ.37, కీర రూ.15, దోసకాయ రూ.35, సొరకాయ రూ.25, పొట్లకాయ రూ.18, కంద రూ.60, ఉల్లిపొరక రూ.55, ఉల్లిగడ్డ రూ.45, మామిడికాయ రూ.15-20, అరటికాయ రూ.8-9, చామగడ్డ రూ.35, ముల్లంగి రూ.4-5, చిలగడ దుంప రూ.35, గుమ్మడికాయ రూ.30, నిమ్మకాయలు రూ.50-60, మునగకాయలు రూ.8-10, బొప్పాయి రూ.40, పుట్టగొడుగులు రూ.40, ఎండుమిర్చి రూ.220, అల్లం రూ.160, వెల్లుల్లి రూ.380, చింతపండు రూ.140, పండుమిర్చి రూ.80, ఉసిరి రూ.80, కరివేపాకు రూ.70, పర్వల్ రూ.45, పల్లికాయ రూ.70, లోబా రూ.45, ఆ కాకరకాయ రూ.120. పైన పేర్కొన్న ధరలు ఈరోజు ఉదయం 9.30 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

కార్తీక శోభ


వేంకటేశ్వస్వామి ఆలయం వద్ద దీపారాధన చేస్తున్న భక్తులు


కార్తీక దీపం వెలిగిస్తున్న మహిళలు



హైదర్‌నగర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కార్తీక సోమవారం పురస్కరించుకొని భక్తులు వివేకానందనగర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయానికి పోటెత్తారు. దీపాలు వెలిగించి, పూజారి నుంచి హారతి తీసుకునేందుకు భక్తులు పోటీపడ్డారు. రాత్రి అన్న సమారాధనకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

● కార్తీకమాసాన్ని పురస్కరించుకుని శ్రీశైల భ్రమరాంబిక మల్లికార్జునస్వామి వారిని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సోమవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రధాన ద్వారం వద్ద కార్తీక దీపం వెలిగించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, తూముకుంటూ ఛైర్మన్ రాజేశ్వరరావు, తులసీరావు, భాస్కర్‌రావు, రవిరాజు, శ్రీనివాస్, రాజు తదితరులు ఉన్నారు.

● ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు దంపతులు కూకట్‌పల్లి శివాలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.


కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని అన్న సమారాధన


శ్రీశైల భ్రమరాంబిక మల్లికార్జునస్వామి వారిని దర్శించుకున్న కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తదితరులు

జరదేఖో..



ఈ విద్యుత్ స్తంభాలను చూశారా ? ఎప్పుడు విరిగి పడిపోతాయో తెలీదు. గాలి దుమారంతో వర్షం పడితే ప్రమాదతీవ్రత చెప్ప నక్కరలేదు. ఈ స్తంభాలన్నీ కూడా కేపీహెచ్‌బీ రోడ్డు నంబర్-1 వెంట ఉన్నవే. టీజీఎస్‌పీడీసీఎల్ అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలను తక్షణమే మార్చాలని కాలనీ వాసులు, వాహనదారులు కోరుతున్నారు.

- కేపీహెచ్‌బీకాలనీ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి)






27మందికి మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను కూకట్‌పల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అందజేశారు.

-హైదర్‌నగర్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి)

రూ.10 కోట్లతో వేసవి ప్రణాళికలు

● నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడమే లక్ష్యం

● అర్హులందరికీ గృహజ్యోతి పథకం అమలు చేస్తున్నాం

● కొండాపూర్ డీఈ రాసూరి శ్యామ్‌కుమార్



ఇంటర్వ్యూ

కేపీహెచ్‌బీకాలనీ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని టీజీఎస్‌పీడీసీఎల్ ఆపరేషన్స్ కొండాపూర్ డీఈ రాసూరి శ్యామ్ కుమార్ తెలిపారు. గృహజ్యోతి పథకం కింద అర్హులైన ప్రతి ఒక్కరికీ ఫ్రీ విద్యుత్ సరఫరా చేస్తున్నామని తెలిపారు. వచ్చే వేసవిని దృష్టిలో పెట్టుకొని రూ.8-10 కోట్ల వ్యయంతో సమ్మర్ యాక్షన్ ప్లాన్ రెడీ చేస్తున్నామన్నారు. ఈ నేపథ్యంలో సోమవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.

వ్యక్తిగత గృహాలకు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసుకోవాలని నోటీసులు ఇస్తున్నారా?

20 కిలోవాట్ల కంటే ఎక్కువ విద్యుత్ వినియోగించుకునే వారు తప్పనిసరిగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసుకోవాలి. మా పరిధిలో 1037 మందికి నోటీసులు ఇచ్చాం. 88 మంది ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసుకుంటామని దరఖాస్తు చేసుకోగా.. 50 మందికి ఎస్టిమేషన్ స్లిప్పులు కూడా ఇచ్చాం. కాంట్రాక్టర్, మధ్యవర్తి ఎవర్నీ సంప్రదించాల్సిన అవసరం లేకుండా నేరుగా ఏఈ లేదా ఏడీఈని సంప్రదిస్తే దరఖాస్తు చేసుకున్న వారం రోజుల్లో విజిట్ చేసి ఎంత ఖర్చు అవుతుంది, ఎంత కెపాసిటీ ట్రాన్స్‌ఫార్మర్ అవసరం అవుతుందన్న విషయం మేము ఫ్రీగానే ఎస్టిమేషన్ వేసి ఇస్తాం. డీడీ లేదా ఆన్‌లైన్‌లో నగదు చెల్లించిన తర్వాత వెంటనే కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తాం.

గృహజ్యోతి పథకం కింద అందరికీ ఫ్రీ విద్యుత్ ఇవ్వడం లేదనే ఆరోపణలున్నాయి. వాటిపై మీరేమంటారు ?

ఫుడ్ సెక్యూరిటీ కార్డు ఉన్న వారు ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారికి మాత్రమే గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల వరకు ఫ్రీ కరెంట్ ఇస్తున్నాం. మొదట్లో మాకు 8,888 దరఖాస్తులు వచ్చాయి. ఆ తర్వాత తప్పులు సరిదిద్దుకుంటూ మార్చి, ఏప్రిల్ నెలల్లో భారీగా దరఖాస్తులు వచ్చాయి. ఆ తర్వాత నుంచి ప్రతినెలా 20-30 కనెక్షన్లు పెరుగుతూ వస్తున్నాయి. ప్రస్తుతం మా డివిజన్ పరిధిలో 14,810 మందికి గృహజ్యోతి పథకం కింద ఉచిత కరెంట్ సరఫరా చేస్తున్నాం. రేషన్ కార్డు కలిగి ఉండి ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకుంటే మీకు గృహజ్యోతి అమలు కాకపోతే వెంటనే స్థానికంగా ఉండే జీహెచ్ఎంసీ వార్డు కార్యాలయంలో సంప్రదిస్తే పోర్టల్‌లో అప్‌డేట్ చేస్తారు. వచ్చే నెల నుంచి ఫ్రీ కరెంట్ అమలవుతుంది.

సమ్మర్ యాక్షన్ ప్లాన్ ఏంటి ? ఎన్ని నిధులు అవసరం ?

వచ్చే సమ్మర్‌కు యాక్షన్ ప్లాన్ రెడీ చేశాం. 8-10 కోట్ల వ్యయంతో లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, ఇంటర్ లింకింగ్, బైఫరికేషన్ వంటివి చేపట్టాల్సి ఉంది. వచ్చే ఏడాది 2025 ఫిబ్రవరి చివరి నాటికి పనులు అన్నీ పూర్తిచేసుకొని మార్చి నుంచి ఎటువంటి సమస్య రాకుండా చూసేందుకు ప్రణాళికలు రచించాం. 38 పబ్లిక్ ట్రాన్స్‌ఫార్మర్లు అధిక లోడ్‌తో ఉన్నాయి. కొత్తగా 18 ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరయ్యాయి. వీటిలో కొన్నింటిని ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలోనే అప్‌గ్రేడ్ చేయడం, ఖాళీ ప్రదేశాలు ఉన్న చోట కొత్తవి ఏర్పాటు చేసే దిశగా ముందుకు సాగుతున్నాం. కేపీహెచ్‌బీ, బాలాజీనగర్, వైట్‌ఫీల్డ్ సెక్షన్ల పరిధిలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు డిమాండ్ ఉంది. వీటి కోసం రూ.1కోటి వరకు నిధులు కావాలి.

జీహెచ్ఎంసీ అనుమతులు లేకుండా నిర్మిస్తున్న అపార్ట్‌మెంట్లు, వాణిజ్య భవనాలకు ట్రాన్స్‌ఫార్మర్లు ఇస్తున్నారా ?

నివాసం, వ్యాపార, వాణిజ్య ఏదైనా సరే నిబంధనల మేరకు ఉంటేనే మేము ప్యానల్ బోర్డు ఇస్తాం. రెండు, మూడు అంతస్తులకు అనుమతి తీసుకొని ఆపైన ఫ్లోర్లు నిర్మించుకున్నా వారికి జీహెచ్ఎంసీ నుంచి అనుమతి, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ చూసి మీటర్లు ఇస్తాం. వారికి ఉన్న లోడును బట్టి ఆ తర్వాత ట్రాన్స్‌ఫార్మర్ ఇస్తాం. కొందరు వ్యాపార, వాణిజ్య కార్యకలాపాల కోసం భవనాలు నిర్మించుకొని కోర్టు ఆర్డర్ తెచ్చుకొని కూడా మీటర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు తీసుకుంటున్నారు. వీరికి కమర్షియల్ కంటే ఎక్కువ ఛార్జీ చేస్తాం. వారికి ఇచ్చే మీటర్లు తాత్కాలికమే వారి పేరుమీద ఇవ్వం. అన్ని అనుమతులు ఉంటే మేము వారం, పది రోజుల్లో మీటర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఇస్తాం. అనుమతి లేని భవనాలకు ప్రభుత్వం ఎప్పుడు వెసులుబాటు ఇస్తే అప్పటి వరకు వేచి ఉండాల్సిందే.

వినియోగదారులు కరెంట్ సమస్య గురించి ఎలా సంప్రదించాలి ?

అన్నీ పని దినాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆయా సెక్షన్ల పరిధిలోని ఏఈలు, ఏడీఈలు అక్కడ పరిష్కారం కాకుంటే నేరుగా నన్ను సంప్రదించవచ్చు. అన్ని సెక్షన్లకు ఫ్యూజ్ ఆఫ్ కాల్ 24/7 ఎప్పుడైనా కాల్ చేయవచ్చు. కేపీహెచ్‌బీ-9490153506, బాలాజీనగర్-9490610180, అల్లాపూర్-7382295953, వైట్‌ఫీల్డ్-9490153516, కొండాపూర్-9490153516.


మహారాష్ట్ర బ్యాంకు సెంటర్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో వెంకట సుబ్బయ్య తదితరులు

టీడీపీ సభ్యత్వ నమోదు

కేపీహెచ్‌బీకాలనీ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): నందమూరి సుహాసిని అక్క యువసేన అధ్యక్షులు హరి సురేష్ ఆధ్వర్యంలో బాలాజీనగర్ డివిజన్ పరిధి మహారాష్ట్ర బ్యాంకు సెంటర్‌లో సోమవారం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి టీడీపీ మాజీ కార్యనిర్వాహక కార్యదర్శి కంకణాల వెంకట సుబ్బయ్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. టీడీపీ సభ్యత్వం తీసుకుంటే కుటుంబ భద్రత ఉంటుందని అన్నారు. మంగళవారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు సభ్యత్వ నమోదు కార్యక్రమం మహారాష్ట్ర బ్యాంకు సెంటర్‌లో కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో చందర్‌రావు, వాసిరెడ్డి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


అల్లాపూర్‌లో బీజేపీ సభ్యత్వ నమోదు చేస్తున్న శ్రీనివాస్ యాదవ్ తదితరులు

బీజేపీ సభ్యత్వ నమోదు

అల్లాపూర్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): అల్లాపూర్ డివిజన్‌లో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం కొద్ది రోజులుగా కొనసాగుతోంది. బీజేపీ ఓబీసీ మోర్చా నేత పులిగొల్ల శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో సోమవారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కె.శ్రీనివాస్, ఎన్.వేణు, కె.రామకృష్ణ, రాజు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి నాలా పనులు పునఃప్రారంభం

అల్లాపూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రామారావునగర్‌లో ఏడాదిగా నిలిచిపోయిన నాలా నిర్మాణ పనులు నేటి నుంచి పునఃప్రారంభమవుతున్నాయని కూకట్‌పల్లి బీఆర్ఎస్ ఓబీసీ నేత నాగుల సత్యం ఓ ప్రకటనలో తెలిపారు. పనులు సజావుగా సాగేందుకు స్థానికులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు, ప్రత్యేకించి నాలా అంచున ఉన్న ఇళ్ల యజమానులు జీహెచ్ఎంసీ అధికారుల సూచనలను పాటించాలని ఆయన కోరారు.


రామారావునగర్‌లో నిర్మాణంలో ఉన్న నాలా పైకప్పు

నిరుపయోగంగా ఈ-కంటెంట్ స్టూడియో

● జేఎన్‌టీయూలో గతేడాది ఆన్‌లైన్ తరగతుల నిర్వహణ కోసం రూ.95లక్షలతో ఏర్పాటు

● టెక్నాలజీ వినియోగానికి ఆమడ దూరంలో వర్సిటీ సీనియర్ ప్రొఫెసర్లు

● పార్ట్‌టైమ్ పీజీ కోర్సులకైనా వినియోగించాలని వర్కింగ్ ప్రొఫెషనల్స్ విజ్ఞప్తి

● కాంట్రాక్ట్ ప్రొఫెసర్లకైనా అప్పగించాలని విద్యార్థి సంఘాల డిమాండ్



జేఎన్‌టీయూ ఈ-కంటెంట్ స్టూడియో

హైదరాబాద్ సిటీ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ తరగతుల నిర్వహణ కోసమని జేఎన్‌టీయూ క్యాంపస్‌లో ఏర్పాటుచేసిన ఈ-కంటెంట్ స్టూడియో నిరుపయోగంగా మారింది. సుమారు రూ.95లక్షలతో ఏర్పాటు చేసిన ఈ స్టుడియో తలుపులు ఏడాది కాలంగా తెరుచుకోవడం లేదు. వాస్తవానికి హైదరాబాద్ క్యాంపస్‌లోని ఈ స్టుడియో నుంచి సీనియర్ ప్రొఫెసర్లతో విద్యార్థులకు పాఠాలు చెప్పించాలని మాజీ వీసీ కట్టా నర్సింహారెడ్డి భావించారు. తద్వారా.. క్యాంపస్ కళాశాలతో పాటు వర్సిటీకి అనుబంధంగా ఉన్న వనపర్తి, జగిత్యాల, సిరిసిల్ల, మంథని, మహబూబాబాద్, పాలేరు జేఎన్‌టీయూ కాలేజీల్లో ఫ్యాకల్టీ కొరతను అధిగమించాలని ప్రయత్నం చేశారు. అయితే.. స్టుడియోను ప్రారంభించిన తర్వాత రెండ్రోజులు మాత్రమే డిజిటల్ క్లాసెస్ నిర్వహించిన వర్సిటీ ప్రొఫెసర్లు.. ఆ తర్వాత స్టుడియో వైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. ఆన్‌లైన్ తరగతులు చెప్పేందుకు ఆచార్యులు ముందుకు రాకపోవడంతో రూ.లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన సదుపాయాలతో తమకు ఎటువంటి ప్రయోజనం ఒనగూరడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

స్టూడియోను వినియోగిస్తే మేలే..

అధునాతన సాంకేతికత కలిగిన ఈ-కంటెంట్ స్టూడియోను సక్రమంగా వినియోగిస్తే.. విద్యార్థులకు ఎన్నో రకాలుగా ప్రయోజనం చేకూరుతుందని వర్సిటీలో పనిచేస్తున్న కాంట్రాక్టు ప్రొఫెసర్లు చెబుతున్నారు. సబ్జెక్టుల వారీగా కంటెంట్‌ని అభివృద్ధి పరచడానికి, ఆ కంటెంట్‌ను ఆర్కైవ్ చేయడానికి ఈ స్టూడియో ఉపకరిస్తుందని, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ నైపుణ్యం, నాణ్యతతో ఇంటరాక్టివ్ ఆన్‌లైన్ సెషన్లు, ఆన్‌లైన్ కోర్సులను నిర్వహించవచ్చని పేర్కొంటున్నారు. ఈ స్టూడియోను సక్రమంగా వినియోగించడం ద్వారా ఆదాయాన్ని కూడా సమకూర్చుకునే అవకాశాలు చాలానే ఉన్నాయంటున్నారు. అయితే, ఈ స్టూడియోకు ఇన్‌చార్జిగా వ్యవహరించిన సీనియర్ ప్రొఫెసర్లు కొందరు స్టూడియోని గాలికి వదిలేశారని ఆరోపిస్తున్నారు. యూనివర్సిటీకి ఆర్నెళ్లుగా రెగ్యులర్ వైస్‌చాన్స్‌లర్ లేకపోవడం, ఇన్‌చార్జి వీసీగా ఉన్న ఐఏఎస్ అధికారి పర్యవేక్షణ కొరవడడంతో స్టూడియో నిర్వహణను పట్టించుకునే నాథుడు కరువయ్యారని విద్యార్థులు సైతం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టెక్నాలజీ వినియోగంపై అవగాహన లేమితో ఆన్‌లైన్ తరగతులంటే సీనియర్ ప్రొఫెసర్లు కొందరు హడలిపోతున్నారని, వారికి ఇష్టం లేనపుడు సాంకేతిక పరిజ్ఞానం ఉన్న కాంట్రాక్టు ప్రొఫెసర్లకైనా స్టూడియో నిర్వహణ బాధ్యతలు అప్పగించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆన్‌లైన్ క్లాసెస్ కావాలని అడిగినా..

వివిధ ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో పనిచేస్తూ జేఎన్‌టీయూ నుంచి పార్ట్‌టైమ్ బీటెక్, ఎంటెక్ కోర్సులు అభ్యసిస్తున్న అభ్యర్థులు తమకు ఆన్‌లైన్ కోర్సులు నిర్వహించాలని జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌కు పలుమార్లు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు అనుమతి కోసమని ప్రిన్సిపాల్ నుంచి రిజిస్ట్రార్‌కు నెలరోజుల క్రితమే లేఖ రాసినప్పటికీ ఉన్నతాధికారులు స్పందించకపోవడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రూ.కోట్ల విలువైన సాంకేతిక సదుపాయాలను వినియోగించుకోవడంలో జేఎన్‌టీయూ ప్రొఫెసర్లు ఫెయిలవుతున్నారని, విద్యార్థులకు మేలు చేకూరే అంశాలకు ఉన్నతాధికారులు మోకాలడ్డు పెట్టడం ఎంతవరకు సబబని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా యూనివర్సిటీ ఉన్నతాధికారులు స్పందించి విద్యార్థులకు మేలు చేకూర్చే విధంగా పార్ట్‌టైమ్ పీజీ విద్యార్థులకు ఆన్‌లైన్ తరగతులు నిర్వహించాలని, ఈ-కంటెంట్ స్టూడియో నిర్వహణ బాధ్యతలను కాంట్రాక్టు ప్రొఫెసర్లకు అప్పగించాలని ఆయా సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు.



ఉత్సవ మూర్తులకు పూజలు చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ఘనంగా శివపార్వతుల కల్యాణం

చందానగర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): చందానగర్ శిల్పాఎన్‌క్లేవ్ ఆలయంలో లక్ష దీపోత్సవంలో భాగంగా సోమవారం శివపార్వతుల ఉత్సవ మూర్తులకు అభిషేకాలు, అర్చనలు చేశారు. సాయంత్రం ఘనంగా శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఫౌండర్ ఛైర్మన్ యువి రమణమూర్తి, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

● చందానగర్ పీజేఆర్‌ఎన్‌క్లేవ్ అయ్యప్పస్వామి ఆలయాన్ని మాస్టర్ మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయుల బృందం సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గురుస్వామి మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలకు చిన్ననాటి నుంచి మన సంస్కృతి సంప్రదాయాలు తెలియచెప్పడంతో పాటు ఆధ్యాత్మిక విలువలు నేర్పించాలన్నారు. స్కూల్ విద్యార్థిని 42రోజుల అయ్యప్ప దీక్ష పూర్తికావడంతో ఇరుముడితో వచ్చి గురుస్వామితో దీక్ష విరమింప చేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, అయ్యప్ప మాలాధరణ భక్తులు పాల్గొన్నారు.



అయ్యప్ప ఆలయంలో విద్యార్థులు

సర్వే గడువులోగా పూర్తయ్యేనా?

● ఒక్కో కుటుంబానికి 40 నిమిషాల సమయం

గచ్చిబౌలి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సామాజిక ఆర్థిక ఉద్యోగ, ఉపాధి, రాజకీయ, కుల గణనన సర్వేలో భాగంగా సోమవారం అన్ని సర్కిళ్లలో కుటుంబాల వారీగా వివరాల సేకరణ జరుగుతోంది. ఎన్యూమరేటర్లు ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు. సూపర్‌వైజర్ల పర్యవేక్షణలో సర్వే సాగుతోంది. ఎన్యూమరేటర్లు చాలా జాగ్రత్తగా మార్గదర్శన్ పుస్తకంలో సూచించిన ప్రకారం పొరపాట్లకు అస్కారం లేకుండా నమోదు చేయిస్తున్నారు.



శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయం

ఈ ప్రకారమైతే..

ఎన్యూమరేటర్లు కుటుంబ వివరాలు సేకరించేందుకు సమయం ఎక్కువ తీసుకుంటున్నారు. గతంలో అధికారులు ఎన్యూమరేటర్లు రోజుకు 30 నుంచి 40 ఇళ్ల వివరాలు సేకరించాలని ఆదేశాలు జారీ చేశారు. వారికి ఇచ్చిన దరఖాస్తుల్లో ప్రశ్నలు ఎక్కువగా ఉండటం, వారికి ఇచ్చిన మార్గదర్శ పుస్తకంలో సూచించిన వివరాల ప్రకారం నమోదు చేయాల్సి ఉంది. అందు కోసం సమయం ఎక్కువ పడుతుందని ఎన్యూమరేటర్లు వాపోతున్నారు. ఈ ప్రకారం జరిగితే రాష్ట్రంలో ప్రభుత్వం ఇచ్చిన గడువులోగా పూర్తికాదని పలువురు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.

● సర్వేలో పాఠశాల విద్యార్థులు పాల్గొంటున్నారని వారితోనే అధికారులు సర్వే చేయిస్తున్నారని ఆరోపణలు ఏ మాత్రం నిజం కాదు. ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ, ఆశావర్కర్లతో సర్వే చేయించడం జరుగుతుంది. అయితే వెస్ట్‌జోన్ పరిధిలోని ఏ సర్కిల్‌లో కూడా విద్యార్థులతో సర్వే చేయిచడం లేదని జోనల్‌మిషనర్ ఉపేందర్‌రెడ్డి స్పష్టం చేశారు.

గడువులోగా సర్వే పూర్తిచేస్తాం



కులగణన సర్వే 15 రోజుల్లో పూర్తిచేయాలని ఆదేశాలు ఉన్న నేపథ్యంలో గడువులోగానే సర్వేను పూర్తిచేసేందుకు సిబ్బంది కష్టపడి పనిచేస్తున్నారు. కుటుంబ వివరాలు సేకరించడం, వారు చెప్పిన వివరాలను మార్గదర్శక పుస్తకంలో నమోదు చేయాలంటే సమయం పడుతుంది. నమోదు ప్రక్రియ వేగవంతంగా జరిగేలా ప్రయత్నాలు చేస్తున్నాం. తాను స్వయంగా అన్ని సర్కిళ్లలో పర్యటించి సర్వే వివరాలు తెలుసుకుంటాను. ఆయా సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్లు, సూపర్‌వైజర్ల పర్యవేక్షణలో సర్వే కొనసాగుతుంది.

-ఉపేందర్‌రెడ్డి, శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్

సర్వేలో వివరాలు తెలిపిన ఎమ్మెల్యే గాంధీ



అధికారాలకు సమాచారం ఇస్తున్న ఎమ్మెల్యే గాంధీ

హైదర్‌నగర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ఇంటింటి కుటుంబ సర్వేలో భాగంగా వివేకానందనగర్‌లోని సప్తగిరి కాలనీలో ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీని డీసీ కృష్ణయ్య, అధికారులు కలిసి వివరాలు నమోదు చేశారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ దేశచరిత్రలో తొలిసారిగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా సమగ్ర కులగణన చేపడుతుందన్నారు. ఎన్నో ఏళ్ల కల నేటితో నేరవేరిందని, ప్రజలు సిబ్బందికి సహకరించి వారు అడిగిన వివరాలు చెప్పాలని సూచించారు. సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

బృందావనంలో కార్పొరేటర్ వివరాల నమోదు



సర్వే అధికారులకు వివరాలు చెబుతున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

హైదర్‌నగర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న కుల గణనలో భాగంగా ఆల్విన్‌కాలనీ డివిజన్ శిల్ప బృందావనంలో కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్ అధికారులతో కలిసి ప్రారంభించారు. ముందుగా కార్పొరేటర్ వివరాలు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ అధికారులకు, సిబ్బందికి సహకరించి తప్పని సరిగా సర్వేలో పాల్గొన్నాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణగౌడ్, సమ్మారెడ్డి, శివరాజ్‌గౌడ్, మల్లేశ్, ఫారూఖ్, ఖలీమ్, శివ, నరసింహులు, ఏఈ నిఖిల్, సీఓ ముస్తఫా, ఆర్‌పిలు, ఎన్యూమరేటర్లు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మియాపూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): హెచ్‌ఎంటీ మక్తా విద్యుత్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు. కుషినగర్, ఎంఎనగర్, స్టాలిన్‌నగర్, ప్రశాంత్‌నగర్, ఆంజనేయస్వామి టెంపుల్ రోడ్‌లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

తుల్జాభవాని అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు

గచ్చిబౌలి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): లింగపల్లి తారానగర్‌లోని తుల్జాభవాని ఆలయంలో కార్తీక మాసం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఉదయం 4 గంటల నుంచి అమ్మవారికి విశేష పూజలు, ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, అన్నప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు జరుగుతున్నాయని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. సాయంత్రం పళ్ల రసాలతో ఉత్సవ విగ్రహాలకు అభిషేకం చేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొనదలిచిన వారు పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ రోజాదేవి, మాజీ కార్పొరేటర్ రంగారావు

డివిజన్ సమస్యలను పరిష్కరించాలి

హైదర్‌నగర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): వివేకానందనగర్ డివిజన్ సమస్యలపై కార్పొరేటర్ రోజాదేవి, మాజీ కార్పొరేటర్ రంగారావు సోమవారం హెచ్‌ఎండబ్ల్యుఎస్ అండ్ ఎస్‌బీ జనరల్ మేనేజర్ ప్రభాకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్‌లో సీవరేజీ లైన్స్ ఈనాడుకాలనీ, విశాల్ టవర్స్ కూకట్‌పల్లి శ్మశానవాటిక మెడికల్ సొసైటీ వరకు, వివేకానందనగర్, రిక్షాపుల్లర్స్ కాలనీ, రామకృష్ణనగర్, కుమ్మరిబస్తీ, వివినగర్‌కాలనీ అపార్ట్‌మెంట్స్‌లో తరుచుగా మురుగునీరు రోడ్డుమీద పొంగి ప్రవహిస్తుందని వీలైనంత త్వరగా సమస్యలు పరిష్కరించాలని ఆమె కోరారు. దీనికి జీఎం సానుకూలంగా స్పందించినట్లు కార్పొరేటర్ తెలిపారు.

డివిజన్‌లో మరో ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్

చందానగర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ల ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో శేరిలింగంపల్లి మండలంలో మరో పోలీస్‌స్టేషన్ రానుందని మండల ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్‌గౌడ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శేరిలింగంపల్లి మండల పరిధి ఎక్కువగా ఉండటంతో రెండోస్టేషన్‌ను కొండాపూర్‌లో ఎక్సైజ్ స్టేషన్ రానుందని తెలిపారు. డివిజన్ల వారీగా నిర్వహించనున్నారని తెలిపారు.

కొండాపూర్ పరిధిలోకి మాదాపూర్, కొండాపూర్ డివిజన్లు వస్తాయని, శేరిలింగంపల్లి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోకి గచ్చిబౌలి, చందానగర్, మియాపూర్ డివిజన్లు వస్తాయన్నారు. ఇప్పటి వరకు మండలంలో 39 వైన్‌షాపులు, 130 బార్లు ఉన్నాయని పేర్కొన్నారు.

గ్రూప్ 3 పరీక్షా కేంద్రాల వద్ద ఆంక్షలు

హైదరాబాద్ సిటీ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో గ్రూప్-3 పరీక్ష కేంద్రాల వద్ద ఆంక్షలను విధిస్తూ సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి ఆదేశాలు జారీ చేశారు. ఈనెల 17, 18 తేదీల్లో నగరంలో పలు పరీక్ష కేంద్రాల్లో గ్రూప్ 3 పరీక్షలు జరగనున్నాయి. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు గాను ఆయా పరీక్ష కేంద్రాల వద్ద 200 మీటర్ల పరిధిలో ఐదుగురి కంటే ఎక్కువ మంది గుమిగూడి ఉండటంపై నిషేధం విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు.



ఆలయాన్ని పరిశీలిస్తున్న రవికుమార్‌యాదవ్, స్థానికులు

ఆలయం తొలగింపును అడ్డుకుంటాం: రవికుమార్

గచ్చిబౌలి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కొండాపూర్ డివిజన్ వడ్డెర బస్తీలో 40 ఏళ్ల నుంచి ఉన్న ఆలయాన్ని అధికారులు ప్రైవేటు సంస్థ అవసరం నిమిత్తం తొలగించేందుకు ప్రయత్నం చేస్తున్నారని, దానిని అడ్డుకుంటామని బీజేపీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జి రవికుమార్‌యాదవ్ అన్నారు. బస్తీకి పక్కనే ఉన్న ఓ ప్రైవేటు ఆస్పత్రి నిర్మాణం జరుగుతుందని, వారికి ఇప్పటికే పలు రహదారులు ఉన్నాయని, అయినా ఆలయం ఉన్న ప్రాంతం నుంచి మరో రోడ్డు నిర్మించాలని ఆలయం తొలగించే ప్రయత్నాలు చేస్తున్నారని దానిని అడ్డుకుంటామని తెలిపారు. స్థానికుల విజ్ఞప్తి మేరకు వడ్డెర బస్తీలో పర్యటించి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఓ సంస్థకు అనుకులంగా పోలీసులు, అధికారులు ఏలా సహకరిస్తారని ప్రశ్నించారు. ఆలయ తొలగింపు ప్రయత్నం విరమించుకోవాలని, ఆలయం జోలికి వస్తే రాష్ట్ర స్థాయిలో అన్ని వర్గాలను కలుపుకున్ని అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ విద్యా దినోత్సవం

గచ్చిబౌలి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): దేశంలో గుణాత్మక విద్యకు మార్గదర్శి, విద్యాభివృద్ధికి బాటలు వేసింది అబ్దుల్‌కలాం ఆజాద్ అని కేంద్రీయ విశ్వవిద్యాలయం ఎడ్యుకేషనల్ టెక్నాలజీ డిపార్ట్‌మెంట్ ఆచార్య రావుల కృష్ణ అన్నారు. సోమవారం లింగంపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ విద్యా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఆజాద్ ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, అఖిలభారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, స్వతంత్ర్య ఉద్యమంలో పదేళ్లపాటు జైలు జీవితం గడిపారని కొనియాడారు. ఆయన తొలి విద్యాశాఖ మంత్రిగా దేశానికి ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. కార్యక్రమంలో అసోసియేషన్ కన్వీనర్ రామస్వామియాదవ్, సభ్యులు పాల్గొన్నారు.



అబ్దుల్‌కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఆచార్య రావుల కృష్ణ, అసోసియేషన్ ప్రతినిధులు



కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు

హైదర్‌నగర్ డివిజన్‌లో

హైదర్‌నగర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని తెలంగాణ మైనార్టీస్ రెసిడెన్షియల్ స్కూల్, కళాశాలలో తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబ్దుల్ కలామ్ ఆజాద్ జయంతి వేడుకలు నిర్వహించారు. కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు ముఖ్యఅథిగా హాజరై ఆజాద్ చిత్రటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జితేందర్, నర్సింహులు, ఉపాధ్యాయులు చంటి, విశాలవాణి, సతీష్, శరయ్య, వాసు, నరసింహ, హబీబ్, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేస్తున్న నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

మియాపూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మాదాపూర్ డివిజన్ ఇజ్జత్‌నగర్‌కు చెందిన ఓరుగంటి శ్యామ్ అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొంది సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నాడు. దీంతో అతనికి మంజూరైన 1,17,500 చెక్కును శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ సోమవారం లబ్ధిదారుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం సహాయనిధి పేదలకు వరం లాంటిందని, అర్హులందరూ ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో జనప్రియ వెస్ట్‌సిటీ వాసులు

కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి

మియాపూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మియాపూర్ డివిజన్ జనప్రియ వెస్ట్‌సిటీ కాలనీ వాసులు సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌ను ఆయన నివాసంలో అసోసియేషన్ వాసులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ జనప్రియ వెస్ట్‌సిటీ వాసులు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను అధికారులు, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ దృష్టికి తీసుకువెళ్లి ప్రాధాన్యత క్రమంలో సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కాలనీలో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో కాలనీ వాసులు గంగాధర్‌రావు, ఇన్నారెడ్డి, సోమిరెడ్డి, ఇమ్మానియేలు, రామలింగం, ప్రదీప్, శ్రీనివాస్‌రెడ్డి, శర్మ తదితరులు పాల్గొన్నారు.

భాగమ్మకు పలువురు నేతల నివాళులు

మియాపూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మాదాపూర్ డివిజన్ బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు ఎర్రగుడ్ల శ్రీనివాస్‌యాదవ్ తల్లి భాగమ్మ దశదినకర్మ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, మాజీ ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్సీ భానుప్రసాద్, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆమె కుమారులు ఎర్రగుడ్ల రాజుయాదవ్, ప్రభాకర్‌యాదవ్, వెంకట్‌యాదవ్, శ్రీనివాస్‌యాదవ్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కూల్చివేతల వ్యర్థాలు తరలించేందుకు హైడ్రా యత్నం

● ప్రభుత్వ భూముల్లో ఆక్రమణల పరిశీలన

పటాన్‌చెరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ శివారు సంగారెడ్డి జిల్లా పరిధిలోని అమీన్‌పూర్ మున్సిపాలిటీలో సోమవారం హైడ్రా సిబ్బంది పర్యటించడంతో అలజడి రేగింది. గతంలో మున్సిపల్ పరిధిలోని పటేల్‌గూడలో రెవెన్యూ హైడ్రా బృందాలు సంయుక్తంగా 28 ఇళ్లను కూల్చివేసిన విషయం తెలిసిందే. కాగా కూల్చివేసిన వ్యర్థాలను తొలగించేందుకు హైడ్రా సిబ్బంది ఎక్సకవేటర్లతో ఉదయం 9 గంటల ప్రాంతంలో ఇళ్ల వద్దకు చేరుకున్నారు. విషయం తెలుసుకున్న బాధితులు హైకోర్టుస్టే ఉత్తర్వులు చూపడంతో సిబ్బంది వెనుదిరిగారు. అనంతరం మున్సిపల్ పరిధిలోని 343 ప్రభుత్వ సర్వే నంబర్లలో ఆక్రమణలను హైడ్రా సిబ్బంది పరిశీలించారు. బంకొమ్ము చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలోని కట్టడాలను పరిశీలించారు. గతంలో మండల పరిధిలోని ప్రభుత్వ సర్వే నంబర్లలో పెద్దఎత్తున ఆక్రమణలు చోటు చేసుకున్నాయని హైడ్రాకు ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో సమగ్ర సర్వేకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ భూములు పెద్దఎత్తున విస్తరించి ఉన్న 993, 630 సర్వే నంబర్లలో ఆక్రమణలను ఇప్పటికే గుర్తించిన తహసీల్దార్ సంగారెడ్డి జిల్లా కలెక్టర్, హైడ్రాకు సమగ్ర నివేదిక సమర్పించారు. సర్వేలో తేలిన సుమారు 700ల పైచిలుకు అక్రమ కట్టడాలకు నోటీసులు సైతం జారీ చేశారు. అమీన్‌పూర్ పెద్ద చెరువుతో పాటు, శంభునికుంట, సంబిచెరువు, శెట్టికుంటల్లోని ఆక్రమణలను సైతం గుర్తించారు. చాలా రోజుల విరామం తరువాత తిరిగి హైడ్రా సిబ్బంది మండల పరిధిలో పర్యటించడంతో ఆక్రమణదారుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. త్వరలోనే ఆక్రమణలను తొలగించే కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలుస్తోంది.



పటేల్‌గూడలో కూల్చివేసిన ఇళ్ల వ్యర్థాల వద్ద హైడ్రా బృందం

న్యుమోనియాతో జర భద్రం

● పల్మనాలజిస్టు డాక్టర్ రాజమనోహర్ ఆచార్యులు



హైదరాబాద్ సిటీ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): న్యూమోనియాతో అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా చలికాలంలో వైద్యుల సలహాలు పాటించాలని మెడికవర్ ఆస్పత్రి పల్మనాలజిస్టు డాక్టర్ రాజమనోహర్ ఆచార్యులు తెలిపారు. ప్రపంచ న్యుమోనియా డే సందర్భంగా ప్రతి ఏడాది కొత్త నినాదంతో కార్యక్రమాలు చేపడుతన్నామని మాదాపూర్‌లోని మెడికవర్ ఆస్పత్రిలో సోమవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయ న వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యుమోనియా అనేది బ్యాక్టీరియా, వైరస్‌లు లేదా ఫంగల్ ఇన్‌ఫెక్షన్ల కారణంగా ఏర్పడే ఒక ఇన్ఫ మేటరీ రెస్పిరేటరీ డిజార్డర్‌గా పేర్కొన్నారు. బలహీనమైన రోగనిరోధక శక్తి ఉన్న వ్యక్తికి, ముఖ్యంగా పిల్లలు, వృద్ధులలో ప్రాణాంతకం కావచ్చునన్నారు. న్యుమోనియాను చికిత్సతో నియంత్రించవచ్చునన్నారు.

గత సంవత్సరాల్లో న్యుమోనియా మరియు ఇతర శ్వాసకోశ అంటువ్యాధుల కారణంగా మరణాల సంఖ్య బాగా పెరిగిందిదన్నారు. ఆస్తమా, దీర్ఘకాలికి సీఓపీడీ, గుండె వ్యాధులు, స్మోకింగ్ అధికంగా చేసేవారు, బలహీనమైన రోగనిరోధక వ్యవస్థ కలిగిఉన్నవారు, కొన్ని రసాయనాలు, కాలుష్య కారకాలకు, విషపూరిత పొగలకు గురైనవారు జాగ్రత్తగా ఉండాలన్నారు. దగ్గు, రక్తంతో కూడిన కఫం, చలి జ్వరం, శ్వాస కోశాల్లో నొప్పి, ఛాతీ భాగంలో నొప్పి, తలనొప్పి, ఆక్సీజన్ స్థాయిల్లో హెచ్చుతగ్గులు వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. ఈ వ్యాధి సోకడం వల్ల కిడ్నీ, గుండె, కాలేయం లాంటి శరీరంలో ఉన్న ఇతర అవయవలు కూడా దెబ్బ తింటాయి అని అన్నారు.

నిరుపయోగంగా ఈ-కంటెంట్ స్టూడియో

- **జేఎన్‌టీయూలో గతేడాది ఆన్‌లైన్ తరగతుల నిర్వహణకు రూ.95 లక్షలతో ఏర్పాటు**
- **టెక్నాలజీ వినియోగానికి ఆమడ దూరంలో వర్సిటీ సీనియర్ ప్రొఫెసర్లు**
- **పార్ట్‌టైమ్ పీజీ కోర్సులకైనా వినియోగించాలని వర్కింగ్ ప్రొఫెషనల్స్ విజ్ఞప్తి**
- **కాంట్రాక్ట్ ప్రొఫెసర్లకైనా అప్పగించాలని విద్యార్థి సంఘాల డిమాండ్**



జేఎన్‌టీయూ ఈ కంటెంట్ స్టూడియో

హైదరాబాద్ సిటీ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ తరగతుల నిర్వహణ కోసమని జేఎన్‌టీయూ క్యాంపస్‌లో ఏర్పాటుచేసిన ఈ-కంటెంట్ స్టూడియో నిరుపయోగంగా మారింది. సుమారు రూ.95లక్షలతో ఏర్పాటు చేసిన ఈ స్టూడియో తలుపులు ఏడాది కాలంగా తెరుచుకోవడం లేదు. వాస్తవానికి హైదరాబాద్ క్యాంపస్‌లోని ఈ స్టుడియో నుంచి సీనియర్ ప్రొఫెసర్లతో విద్యార్థులకు పాఠాలు చెప్పించాలని మాజీ వీసీ కట్టా నర్సింహారెడ్డి భావించారు. తద్వారా.. క్యాంపస్ కళాశాలతో పాటు వర్సిటీకి అనుబంధంగా ఉన్న వనపర్తి, జగిత్యాల, సిరిసిల్ల, మంథని, మహబూబాద్, పాలేరు జేఎన్‌టీయూ కాలేజీల్లో ఫ్యాకల్టీ కొరతను అధిగమించాలని ప్రయత్నం చేశారు. అయితే.. స్టుడియోను ప్రారంభించిన తర్వాత రెండ్రోజులు మాత్రమే డిజిటల్ క్లాసెస్ నిర్వహించిన వర్సిటీ ప్రొఫెసర్లు.. ఆ తర్వాత స్టూడియో వైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. ఆన్‌లైన్ తరగతులు చెప్పేందుకు ఆచార్యులు ముందుకు రాకపోవడంతో రూ.లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన సదుపాయాలతో తమకు ఎటువంటి ప్రయోజనం ఒనగూరడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

స్టూడియోను వినియోగిస్తే మేలే..

అధునాతన సాంకేతికత కలిగిన ఈ-కంటెంట్ స్టూడియోను సక్రమంగా వినియోగిస్తే.. విద్యార్థులకు ఎన్నో రకాలుగా ప్రయోజనం చేకూరుతుందని వర్సిటీలో పనిచేస్తున్న కాంట్రాక్టు ప్రొఫెసర్లు చెబుతున్నారు. సబ్జెక్టుల వారీగా కంటెంట్‌ని అభివృద్ధి పరచడానికి, ఆ కంటెంట్‌ను ఆర్కైవ్ చేయడానికి ఈ స్టూడియో ఉపకరిస్తుందని, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ నైపుణ్యం, నాణ్యతతో ఇంటరాక్టివ్ ఆన్‌లైన్ సెషన్లు, ఆన్‌లైన్ కోర్సులను నిర్వహించవచ్చని పేర్కొంటున్నారు. స్టూడియోను సక్రమంగా వినియోగించడం ద్వారా ఆదాయాన్ని కూడా సమకూర్చుకునే అవకాశాలు చాలానే ఉన్నాయంటున్నారు. అయితే, ఈ స్టూడియోకు ఇన్‌చార్జిగా వ్యవహరించిన సీనియర్ ప్రొఫెసర్లు కొందరు స్టూడియోని గాలికి వదిలేశారని ఆరోపిస్తున్నారు. యూనివర్సిటీకి ఆర్నెళ్లుగా రెగ్యులర్ వైస్‌చాన్స్‌లర్ లేకపోవడం, ఇన్‌చార్జి వీసీగా ఉన్న ఐఏఎస్ అధికారి పర్యవేక్షణ కొరవడడంతో స్టూడియో నిర్వహణను పట్టించుకునే నాథుడు కరువయ్యారని విద్యార్థులు సైతం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టెక్నాలజీ వినియోగంపై అవగాహన లేమితో ఆన్‌లైన్ తరగతులంటే సీనియర్ ప్రొఫెసర్లు కొందరు హడలిపోతున్నారని, వారికి ఇష్టం లేనపుడు సాంకేతిక పరిజ్ఞానం ఉన్న కాంట్రాక్టు ప్రొఫెసర్లకైనా స్టూడియో నిర్వహణ బాధ్యతలు అప్పగించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆన్‌లైన్ క్లాసెస్ కావాలని అడిగినా..

వివిధ ప్రభుత్వ ప్రైవేటు సంస్థల్లో పనిచేస్తూ జేఎన్‌టీయూ నుంచి పార్ట్‌టైమ్ బీటెక్, ఎంటెక్ కోర్సులు అభ్యసిస్తున్న అభ్యర్థులు తమకు ఆన్‌లైన్ కోర్సులు నిర్వహించాలని జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌కు పలుమార్లు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు అనుమతి కోసమని ప్రిన్సిపాల్ నుంచి రిజిస్ట్రార్‌కు నెలరోజుల క్రితమే లేఖ రాసినప్పటికీ ఉన్నతాధికారులు స్పందించకపోవడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రూ.కోట్ల విలువైన సాంకేతిక సదుపాయాలను వినియోగించుకోవడంలో జేఎన్‌టీయూ ప్రొఫెసర్లు ఫెయిలవుతున్నారని, విద్యార్థులకు మేలు చేకూరే అంశాలకు ఉన్నతాధికారులు మోకాలడ్డు పెట్టడం ఎంతవరకు సబబని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా యూనివర్సిటీ ఉన్నతాధికారులు స్పందించి విద్యార్థులకు మేలు చేకూర్చే విధంగా పార్ట్‌టైమ్ పీజీ విద్యార్థులకు ఆన్‌లైన్ తరగతులు నిర్వహించాలని, ఈ-కంటెంట్ స్టూడియో నిర్వహణ బాధ్యతలను కాంట్రాక్టు ప్రొఫెసర్లకు అప్పగించాలని ఆయా సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు.

కబ్జాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదు

● కుత్బుల్లాపూర్ తహసీల్దార్ అబ్దుల్ రెహ్మాన్



ఇంటర్వ్యూ

గాజులరామారం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కబ్జాకు గురైన ప్రభుత్వ భూముల్లో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసి, ప్రజా ప్రయోజనాల కోసం ఉపయోగపడేలా కృషి చేస్తామని కుత్బుల్లాపూర్ మండల తహసీల్దార్ అబ్దుల్ రెహ్మాన్ ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలను వెల్లడించారు.

● ప్రభుత్వ భూములు కబ్జాలకు గురవుతున్నాయి. వాటిని ఎలా నివారిస్తారు?

ప్రభుత్వ భూములను కాపాడేందుకు కృషి చేస్తూ, కబ్జాదారులపై కేసులను నమోదు చేసి చట్టపరమైన, చర్యలు తీసుకుంటాం.

● కబ్జాకు గురైన భూముల్లో ఇప్పటికే బస్తీలు వెలిశాయి. వాటిని ఎలా స్వాధీనం చేసుకుంటారు?

ప్రభుత్వ భూములు ఎంతమేరకు కబ్జాకు గురయ్యాయో సర్వే చేశాం. త్వరలోనే వాటిలో ప్రభుత్వ హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేస్తామని చెప్పారు.

● అధికారులు కబ్జాలకు సహకరించారన్న ఆరోపణలున్నాయి. వాటిపై మీ సమాధానం?

కబ్జాదారులకు సహకరించిన వారిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదు.

● కూల్చివేతలతోనే సరిపెడతారా? స్వాధీనం చేసుకుంటారా?

కొత్తగా ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలు వెలిస్తే వెంటనే కూల్చివేసి, ఆ భూముల్లో బోర్డులను ఏర్పాటు చేస్తున్నాం. ఇక ముందు ఎటువంటి కబ్జాలకు గురి కాకుండా చూస్తామన్నారు.

రోడ్ల పక్కనే ఇసుక, కంకర డంపింగ్

● సర్వీస్ రోడ్లపై ప్రయాణానికి ఇబ్బందులు ● పట్టించుకోని అధికారులు



రోడ్డు పక్కనే డంప్ చేసిన కంకర

షాపూర్‌నగర్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): సర్వీస్ రోడ్లను ఆక్రమించి కొంతమంది వ్యాపారులు జోరుగా వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. ఇంత జరుగుతున్నా ఇండస్ట్రియల్ ఐలా అధికారులు నిద్రమత్తులో జోగుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. వివరాల్లోకి వెళితే బాలానగర్, సర్దాపూర్ ప్రధాన రహదారిలో జీడిమెట్ల బస్ డిపో నుంచి సూరారం వరకు ప్రధాన రహదారికి ఇరువైలా ఉన్న సర్వీస్‌రోడ్లను ఆక్రమించి కంకర, ఇసుక, డస్ట్, ఇటుకలు తదితర మెటీరియల్‌ను విక్రయిస్తున్నారు. ఎటువంటి అనుమతులు లేకపోయినా పోలీసులకు, అధికారులకు ముడుపులు ముట్టజెప్పి మూడుపువ్వులు ఆరుకాయలు అన్న చందంగా విక్రయాలు సాగిస్తున్నారు. ఈ సర్వీస్‌రోడ్లు ప్రధాన రహదారికి ఇరువైపులా ఉండటం వల్ల ఇండస్ట్రియల్ గ్రీన్ కావడంతో పరిశ్రమలకు ముడిసరుకు, తయారైన మెటీరియల్‌ను తరలించేందుకు నిత్యం వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు సాగించడం వలన రాకపోకలకు తీవ్ర అంతరాయం వాటిల్లుతుందని వాహనదారులు అంటున్నారు. అక్రమ వ్యాపారాలను అడ్డుకోవలసిన అధికారులే నిద్రమత్తులో జోగుతుంటే వీటిని పరిరక్షించేది ఎవరని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

రోడ్లలో రాకపోకలకు అంతరాయం

అక్రమ వ్యాపారాలతో రోడ్లవెంట రాకపోకలు సాగించే పరిస్థితి లేదని పలువురు ఆరోపిస్తున్నారు. షాపూర్‌నగర్ నుంచి సూరారం వరకు ఇండస్ట్రీస్ ఉండడంతో ప్రధాన రహదారికి ఇరువైపులా సర్వీస్ రోడ్లు ఉండాలి. కానీ జీడిమెట్ల డిపో నుంచి సూరారం, సబ్‌స్టేషన్ నుంచి జీడిమెట్ల బస్సు డిపో వరకే సర్వీస్ రోడ్లు ఉన్నాయి. షాపూర్‌నగర్‌లో సర్వీస్ రోడ్లు ఏమయ్యాయని పలువురు నిలదీస్తున్నారు. ఇండస్ట్రియల్ గ్రీన్ బెల్ట్ పరిధిలో ఉండాల్సిన రోడ్లు కబ్జాకి గురయ్యాయా? లేక అసలు లేవా అనే ప్రశ్న తలెత్తుతుంది. సర్వీస్ రోడ్లు పరిశ్రమలకు ఉపయోగపడకపోగా, ఉన్న రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు సాగించడంతో ఈ రోడ్లు నిరుపయోగంగా మారాయి. ఈ రోడ్ల వెంట రాకపోకలు నిలిచిపోయాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



సర్వీస్ రోడ్డుపైనే నిలిపిన వాహనాలు

రోడ్డుకు అడ్డంగా లోడింగ్.. అన్‌లోడింగ్

వాహనాలను రోడ్లపైనే ఆపి మెటీరియల్ లోడింగ్ చేయడం, వచ్చిన ఇసుక, కంకర, డస్ట్, అన్‌లోడింగ్‌తో నిత్యం ఇబ్బందికరంగా మారుతుంది. మెటీరియల్స్ తీసుకువచ్చిన లారీలను అక్కడే పార్కింగ్ చేయడంతో ఈ రోడ్ల వెంట వెళ్ళే వాహనదారులు, పాదాచారులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు సాగిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.



సర్వీస్ రోడ్డు పక్కనే డంపింగ్ చేసిన ఇసుక

బస్‌స్టాప్‌ల కోసం కేటాయించాలి



ఇండస్ట్రియల్ ఉన్న గ్రీన్‌బెల్ట్‌లో ఉన్న సర్వీస్ రోడ్లు నిరుపయోగంగా మారాయి. ఈ రోడ్లను దూరప్రాంతాలకు వెళ్ళే బస్సుల పార్కింగ్‌కు కేటాయించాలి. దీనివల్ల ప్రయాణికులకు వెసులుబాటుగా ఉంటుంది. అక్రమ వ్యాపారాలు సాగిస్తున్న వారిపై అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి. ప్రధాన రహదారికి ఇరువైపుల ఉన్న సర్వీస్‌రోడ్లను గుర్తించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావాలి.

- ఎన్. దయాకర్‌చారి, కార్మికుడు

కార్మికుని కుటుంబానికి నష్టపరిహారం అందజేత



కార్మికునికి చెక్కును అందజేస్తున్న రవిసింగ్

షాపూర్‌నగర్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం శ్రీనివాస్ నగర్‌లో భవన నిర్మాణ పనులు చేస్తున్న దుర్గాప్రసాద్ అనే కార్మికుడు గోవాకు కట్టెలు కడుతుండగా కిందకు పడిపోయాడు. దీంతో అతడి నడుముకి బలమైన గాయమైంది. ఈ విషయం తెలిసిన బీఆర్‌టీయు రాష్ట్ర నాయకుడు, శ్రమశక్తి అవార్డు గ్రహీత రవిసింగ్ యాజమాన్యంతో చర్చించి బాధితునికి నష్టపరిహారంతో పాటు ఆస్పత్రి ఖర్చులు మొత్తం కలిపి లక్ష రూపాయలు కుటుంబ సభ్యులకు ఇప్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్లే ఇదంతా జరిగిందని, ఎలాంటి సేఫ్టీ ప్రమాణాలు పాటించకపోవడం వల్లే కార్మికులు ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు.

కార్మికులను తొలగిస్తే సహించేది లేదు



కార్మికునికి చెక్కును అందిస్తున్న నాగరాజు

జీడిమెట్ల, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కార్మికులను అర్ధాంతరంగా విధుల నుంచి తొలగిస్తే సహించేది లేదని ఐఎన్‌టీయూసీ కార్మిక నాయకుడు చింతల నాగరాజు అన్నారు. ప్రశాంత్‌నగర్ ఇండస్ట్రియల్ ప్రాంతంలోని జెఎస్సీ ఇంజనీరింగ్ అండ్ సర్వీసెస్ పరిశ్రమలో ఏడు సంవత్సరాలుగా పనిచేస్తున్న షెబాస్టియల్ అనే కార్మికుడిని కంపెనీ యాజమాన్యం విధుల నుంచి తొలగించడంతో ఆయనను ఆశ్రయించగా, యాజమాన్యంతో మాట్లాడి కార్మికునికి 1లక్ష 50వేల రూపాయాల నష్టపరిహారం ఇప్పించారు. కార్యక్రమంలో శేషురావు, దేవేందర్, సాయినాథ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

వేధింపులతో గృహిణి ఆత్మహత్య

జీడిమెట్ల, నవంబరు11(ఆంధ్రజ్యోతి): అత్తింటి బాధలు భరించలేక ఓ గృహిణి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం విజయనగరం ప్రాంతానికి చెందిన దేవిశెట్టి దివ్యభారతి(24), దత్తసాయిప్రతాప్ భార్యాభర్తలు. వీరు మధుసూదన్‌రెడ్డినగర్, చింతల్‌లో నివశిస్తున్నారు. వీరికి దాదాపు 3 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. ఈమె భర్త సాయిప్రతాప్ విర్కోల్యా బయోటెక్స్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. వివాహం జరిగినప్పటి నుంచి భర్త, అత్త, మామ దివ్యభారతిని వేధింపులకు గురిచేసేవారు. ఈ క్రమంలో ఆదివారం ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. జీడిమెట్ల పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సమగ్ర సర్వేను పర్యవేక్షించిన కమిషనర్

దుండిగల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): దుండిగల్ మున్సిపాలిటీ ప్రాంతంలో 24 మంది ఎన్యూమరేటర్లు దుండిగల్ కమిషనర్ సత్యనారాయణ పర్యవేక్షణలో సమగ్ర సర్వే కొనసాగిస్తున్నారు. సర్వే సాఫీగా సాగేలా ప్రభుత్వ ఆదేశాలను తూచ తప్పకుండా పాటించాలని సర్వే బృందాలకు సూచనలు చేస్తూ వస్తున్నారు. సోమవారం దొమ్మర పోచంపల్లి, 60 గజాల కాలనీ, బహదూర్‌పల్లి, బహదూర్‌పల్లి ఇందిరమ్మ కాలనీల్లో సమగ్ర సర్వేను కమిషనర్ పరిశీలించి, పర్యవేక్షించారు. స్వయంగా ఇంటి యజమానులతో మాట్లాడి ఎలాంటి సందేహాలున్నా తన దృష్టికి తీసుకురావాలని కమిషనర్ సూచించారు. సర్వేకు వచ్చే ఎన్యూమరేటర్లకు ఎలాంటి పేపర్లు ఇవ్వనవసరంలేదని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం అడితే ప్రశ్నలకు సమాధానం చెబితే సరిపోతుందన్నారు. ఈ సమగ్ర సర్వే పూర్తయ్యే వరకు ప్రజలు సహకరించాలని ఈ సందరంగా తెలిపారు.



డి.పోచంపల్లి 60 గజాల కాలనీలో సమగ్ర సర్వేను పరిశీలిస్తున్న దుండిగల్ కమిషనర్ సత్యనారాయణ

రోడ్డును విస్తరించాలి.. ట్రాఫిక్ సమస్య తీర్చాలి

● బీజేపీ అధ్యక్షుడు నరేంద్రచౌదరి

నిజాంపేట్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నిజాంపేట్ కార్పొరేషన్ ప్రగతినగర్ నుంచి జెఎన్‌టీయూ వరకు రోడ్డు విస్తరణ పనులు చేపట్టి పూర్తి చేయాలని ప్రగతీనగర్ బీజేపీ అధ్యక్షుడు నరేంద్రచౌదరి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రోడ్ల సమస్యపై ఆయన మాట్లాడుతూ దేశంలోనే ఉత్తమ పంచాయితీగా ఐఎస్‌ఓగా గుర్తింపు పొందిన మొట్టమొదటి గ్రామం ప్రగతినగర్ పంచాయితీ అన్నారు. వేలల్లో ఉన్న జనాభా ప్రస్తుతం లక్షలకు చేరుకుంది. వందల్లో ఉన్న వాహనాలు వేలల్లోకి చేరుకున్నాయి. కానీ రోడ్డు మాత్రం అప్పుడు ఎలా ఉన్నాయో, ఇప్పుడూ అదేవిధంగా ఉన్నాయని, వాహనాల రద్దీకి తగ్గట్టుగా రహదారుల విస్తరణ చేపట్టాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఆస్పత్రులకు వెళ్లటానికి ట్రాఫిక్ సమస్య జటిలంగా మారుతుంది. ప్రగతినగర్ పన్నుల చెల్లింపుల్లో ఎప్పుడూ ముందు వరుసలో ఉన్నారు. మౌలిక సదుపాయాల కల్పనలో ప్రభుత్వం, ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యాన్ని ఖండిస్తున్నామని అన్నారు. ఈ సమస్యలను పరిష్కరిస్తారని మూడు దఫాలుగా ఎమ్మెల్యే వివేకాంద్‌ను గెలిపిస్తే, గెలిచాక సమస్యను గాలికి వదిలేశారని నరేంద్ర చౌదరి ఆరోపించారు. ఈ విషయంలో బీజేపీ ప్రజల పక్షాన పోరాడి, రోడ్డు విస్తరణా? లేదా ఫ్లైఓవర్ నిర్మించడమా తేలేవరకు వరకు పోరాడుతామన్నారు. రెండు వారాల్లో ఈ సమస్య కార్యాచరణ దాల్చకపోతే బీజేపీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.



నరేంద్రచౌదరి

ఘనంగా కార్తీకమాస పూజలు

షాపూర్‌నగర్, నవంబర్ 11(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం రెండవ సోమవారాన్ని పురస్కరించుకొని సూరారం ఉమమహేశ్వర దేవాలయంలో ఆలయ ధర్మకర్త ముద్దాపురం మదన్‌గౌడ్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఈ పూజలకు భక్తులు ఉదయం నుంచే పెద్దఎత్తున తరలివచ్చారు. ఉదయం 5గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు జరిగిన పూజల్లో అభిషేకాలు, శివునికి జ్యోతిర్లింగార్చన నిర్వహించారు. జాగృతి మహిళామండలి అధ్యక్షురాలు శివపార్వతి ఉదయం దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్తీకమాసంలో భక్తులు నిష్ఠగా పూజలు చేస్తే శివుని అనుగ్రహం దక్కుతుందన్నారు.

ట్రాఫిక్‌పై విద్యార్థులకు అవగాహన : ట్రాఫిక్ ఏసీపీ

దుండిగల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించవద్దని మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీ వెంకట్‌రెడ్డి అన్నారు. కొంపల్లి మున్సిపల్‌లోని దూలపల్లి సెయింట్ మార్టిన్ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం ట్రాఫిక్ అవగాహన కార్యక్రమాన్ని అల్వాల్ ట్రాఫిక్ పోలీసులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏబుల్ 6వ అధికారి పర్యవేక్షణలో విద్యార్థులకు స్లయిడ్స్ ద్వారా నిబంధనలు అతిక్రమిస్తే జరిగే ప్రమాదాలు.. త్రిబుల్ రైడింగ్, ర్యాష్ డ్రైవింగ్, రాంగ్ రూట్ డ్రైవింగ్‌ల వల్ల జరిగే అనర్థాలను విద్యార్థులకు చూపించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ నాగరాజు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



స్లయిడ్స్ ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ వెంకట్‌రెడ్డి

క్రిస్మస్ సెలబ్రేషన్‌కు సహకారమందించాలి



కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డితో రవికుమార్

నిజాంపేట్, నవంబరు11(ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గ క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ ఛైర్మన్ దీపక్‌జాన్ తెలంగాణ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా ఉన్న రవికుమార్‌ను డిసెంబరులో నిర్వహించే క్రిస్మస్ సెలబ్రేషన్‌కు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కో-ఆర్డినేటర్‌గా అదనపు బాధ్యతలు కట్టబెట్టిన సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డిని సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. క్రిస్టియన్ మైనార్టీ కార్యక్రమాలకు హాజరై సహాయ సహకారాలందించాలని ఈ సందర్భంగా కోరారు. ఆయనను కలిసిన వారిలో కాం గ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కుమార్ భూపతి, ఎన్ఎంసీ మైనార్టీ అధ్యక్షుడు అందజర్, సాలెంరాజు ఉన్నారు.

ఒకేషనల్ విద్యార్థులకు ఆన్ ద జాబ్ ట్రైనింగ్

దుండిగల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఒకేషనల్ విద్యార్థులకు నవంబరు 1 నుంచి డిసెంబర్ 31వ వరకు రెండు నెలలు పాటు ఆన్ ద జాబ్ ట్రైనింగ్(ఓజేటి)ను నిర్వహిస్తున్నారు. దానిలో భాగంగా బహదూర్‌పల్లిలో కేఎం పాండు మెమోరియల్ గవర్నమెంట్ జూనియర్ కాలేజీ విద్యార్థులు ఓజేటీలో పాల్గొంటున్నారు. దీనిలో ఐటీ, ఎలక్ట్రికల్, టెక్నీషియన్, ఎంఎల్‌టీ మెడికల్, ల్యాబ్ టెక్నీషియన్, ఎంపీహెచ్‌డబ్ల్యూ మల్టీ పర్పస్ హెల్త్ వర్కింగ్ ఉమెన్, పీఎస్ కంప్యూటర్ విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు.

ఈటీ, ఎలక్ట్రికల్ టెక్నీషియన్, టీజీ, ఎస్పీ, డీసీఎల్, ఆర్ఐటీ, రేడియాట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రాంతాల్లో ఓజేటీ నిర్వహిస్తారు. ఎంఎల్‌టీ మెడికల్ ల్యాబ్ టెక్నిషియన్లు అరుంధతి, లైఫ్ స్పాన్ మెడ్విజన్ ఆస్పత్రుల్లో ఓజేటీ ఎంపీహెచ్‌డబ్ల్యూ ఫిమేల్ విద్యార్థులు, దుండిగల్ సూరారం యూపీహెచ్‌సీ సెంటర్లలో ఓజేటీ నేర్చుకుంటున్నారు. ఇందులో భాగంగా మేడ్చల్ మల్కాజ్‌గిరి డీఐఈఓ ఎం. కిషన్ సోమవారం సందర్శించి, ఇన్‌స్పెక్షన్ చేసి ఈటీ విద్యార్థులు, టీజీ ఎస్పీడీసీఎల్‌కు వచ్చి విద్యార్థులను పర్యవేక్షించి, వివిధ ప్రశ్నలను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా దుండిగల్‌లోని అరుంధతి ఆస్పత్రికి వెళ్లి ఈటీ విద్యార్థులు ఏవిధంగా శిక్షణ పొందుతున్నారో వివరాలను కూడా తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ షేక్ షైమూన్ పాల్గొన్నారు.

రోడ్లకు మరమ్మతులు చేపట్టండి

● 'ప్రజావాణి'లో ఫిర్యాదుల వెల్లువ

కుత్బుల్లాపూర్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలో రోడ్లకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని పలు బస్తీలు, కాలనీల ప్రజలు ప్రజావాణిలో విన్నవించుకున్నారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ ఉప కమిషనర్ వడ్డేపల్లి నర్సింహ, గాజులరామారం ఉప కమిషనర్ మల్లారెడ్డిలకు వినతి పత్రాలు అందజేశారు. ప్రధానంగా గాజులరామారం సర్కిల్ పరిధిలోని గాజులరామారం, దేవేందర్, కైసర్‌నగర్ ప్రాంతాల్లో రోడ్లకు మరమ్మత్తులు చేయాలని, మరికొన్ని ప్రాంతాల్లో కొత్త రోడ్లు నిర్మించాలని కోరారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని సూరారంకాలనీ కూరగాయాల మార్కెట్ ప్రాంతంలో నిత్యం మురికినీరంతా రోడ్డుపై పారుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఫిర్యాదు చేశారు. జంట సర్కిళ్ల పరిధిలో అక్రమ నిర్మాణాలపై టౌన్ ప్లానింగ్ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని తెలుపగా, తప్పకుండా చర్యలు తీసుకుంటామని డీసీలు తెలిపారు. అలాగే పించన్ల మంజూరు, ఉచిత విద్యుత్ అమలు చేయాలని దరఖాస్తులు చేసుకున్నారు. సీపీఎం నాయకులు కీలుకాని లక్ష్మణ్‌కు డీసీ మల్లారెడ్డికి మధ్య వాగ్యుద్ధం జరిగింది. సమస్యలు పరిష్కరించకుండా అధికారులు దురుసుగా ప్రవర్తిస్తున్నారని లక్ష్మణ్ అన్నారు. రెండు సంవత్సరాల నుంచి పెన్షన్లు రావడం లేదని, ఏదైనా కావాలంటే కలెక్టర్ కార్యాలయానికి వెళ్లాలని డీసీ సూచించారు. ఈ కార్యక్రమంలో ఈఈ లక్ష్మీగణేష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



ఉప కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న దేవేందర్‌నగర్ వాసులు



ఉప కమిషనర్ నర్సింహకు వినతి పత్రం అందిస్తున్న మహిళ



డీసీ మల్లారెడ్డితో ప్రజాసమస్యలపై వాగ్యుద్ధం చేస్తున్న సీపీఎం నాయకులు లక్ష్మణ్

కుత్బుల్లాపూర్.. రోడ్ల నిర్వహణ పూర్!

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో పలుచోట్ల రహదారులపై గుంతలు పడి రోడ్లు అధ్వాన్నంగా మారాయి. నిజాంపేట్ మెయిన్‌రోడ్డు, గోకరాజు ఇంజనీరింగ్ కాలేజీ తదితర ప్రాంతాల్లో కంకర తేలిన రోడ్లపై రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లు ఇలా ఉండే ప్రయాణం ఎలా చేయాలని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కంకర తేలి, గుంతలు పడిన నిజాంపేట్ గోకరాజు రంగరాజు కాలెజి దగ్గర రోడ్డు







నిజాంపేట్ సిండికేట్ బ్యాంకు దగ్గర రోడ్డు పరిస్థితి



నిజాంపేట్ మెయిన్ రోడ్డు

